
# కాకరకాయ కథ




ఒకసారి ట్రావెర్స్‌దొర అల్లూరు ప్రాంతానికి రాగానే కుంభవృష్టి మొదలయింది. ఎప్పుడు తగ్గుతుందో తెలియదు.

చరిత్రలో కొన్ని కొన్ని తమాషాలు జరుగుతాయి. అలాంటివి ఎక్కడైనా, ఎప్పుడైనా జరగవచ్చు. కాని, కొన్ని మాత్రమే చరిత్రలో స్థానం పొందుతాయి. అలా కొన్నింటికి మాత్రమే ఆ గౌరవం ఎందుకు లభిస్తుందని అడిగితే సమాధానం అంత తేలిక కాదు. కాకపోతే చరిత్రకారుల ఆదరణ వుంటే అల్పమైన ఉదంతాలకు కూడా శాశ్వత స్థానం కొంత దొరకవచ్చునేమో! అంతకంటే మించి మరొకటేదో వుండాలి. అలాంటిదే కాకరకాయ కథ.

చాతుర్యం కొందరికే వుంటుంది. అయినా సమయం, సందర్భం కలిసి వచ్చినప్పుడు చతురులకు ఎనలేని గౌరవం లభిస్తుంది. దానినే అదృష్టం అంటారు. సమయం, సందర్భం చెప్పిరావు.

నేటి ప్రకాశం జిల్లాలో అల్లూరనే గ్రామం వుంది. అది ఒకనాడు పొదిలి సీమలో వుండేది. జిల్లా కలెక్టర్ ట్రావెర్స్ దొర. దాదాపుగా 200 సంవత్సరాల క్రితం కావచ్చును. గుర్రం మీదనే మండలమంతా పర్యటించేవాడు. బహుదొడ్డ బుద్ధి కలవాడని పేరు.

ఒకసారి ట్రావెర్స్ దొర అల్లూరు ప్రాంతానికి రాగానే కుంభవృష్టి మొదలైంది. వాగులు పొంగాయి. ఊరు నాడు ఏకమైంది. పరివారంతో ముసాఫిర్ (క్యాంప్)లో వున్న దొరగారికి దారి తోచలేదు. వర్షం ఎప్పుడు తగ్గుతుందో, వాగులు ఎప్పుడు తీస్తాయో తెలియదు.

ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో తెలియదుగాని దొరగారు పరివారానికి దూరమయ్యారు. ఎంతసేపు ఎదురు చూడాలి? ఆకలి మండి పోతోంది. నీరసంగా వుంది. దానికి తగ్గట్టు చలి వెన్నులో వణికించేస్తోంది. ఎవరు దిక్కు! అంతటి దొరగారు దిక్కూ దివాణం లేని వాడయ్యాడు.

అల్లూరులో ఇమ్మానేని వారిది పెద్ద కుటుంబం. ఇమ్మానేని వారంటే వాయని కృష్ణకుమారిగారి తండ్రి సుబ్బారావుగారి మేనత్త భర్తగారి వంశమట. ఆ వంశంలోని పూర్వీకులలో ఒకరికి సంబంధించింది ఈ కాకరకాయ కథ.

సరే దొరగారికి ఆతిథ్యం ఇవ్వగలిగినది ఇమ్మానేనివారి ఇల్లు మాత్రమే. అయితే అంత జడివానలో మండలాధిపతి ట్రావెర్స్ దొరగారికి అన్నపానాలు ఏర్పాటు చేయడం మాటలు కాదు. బయటకు పోవడానికి వీలులేని సమయం అది.

ఆ ఇంటి కోడలు బహుచతురురాలు. ఇంట్లో మసాల దినుసులన్నీ కలిపి ఏమేమో చేసింది. పెరడులో కాకరపాదు వుంది. ఆ చెట్టుకు కాయలు వ్రేలాడుతూ వుంటే తటిల్లతలా ఆలోచన వచ్చింది. చెట్టుకు కాయలు కొయ్యకుండానే, కాయల పొట్ట చీల్చి మసాలా కూరింది. కణకణలాడే నిప్పుల కుంపటి తెచ్చి, కాయలు నిప్పులకు తాకేటట్టు పట్టుకొన్నది. కొంత సేపటికి కాయ కమిలిపోయింది.

వేడి వేడి అన్నం వడ్డించింది. చెట్టు నుంచి ఆకులతో సహా తెంచిన కాకరకాయలు కోసి వేసింది. రుచి ఎలా వుందో గాని మంచి ఆకలి మీద వున్నాడేమో దొరగారు లొట్టలు వేస్తూ తిన్నాడు.

ఇంటి కోడలు కూర ఎలా వండిందో తెలుసుకొని ఆమె చాతుర్యానికి అబ్బురపడి పేర్నిమెట్ట అనే గ్రామంలో నూరు గొర్ల భూమిని మాన్యంగా బహూకరించాడట. తదారభ్యం కాకరకాయ మాన్యం పేరుతో ఆ ఈనామును ఆ వంశీకులు అనుభవిస్తున్నారట. ఈ వృత్తాంతాన్ని వాయని సుబ్బారావుగారు తమ జన్మభూమి పద్యకావ్యంలో చక్కగా వర్ణించారు.

— లంక అన్నపూర్ణ